సాక్షి నల్లగొండ

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



సెల్‌ఫోన్ వదిలితేనే స్టీరింగ్

రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. డ్రైవర్లు సెల్‌ఫోన్ వాడొద్దని ఆదేశాలు జారీ చేసింది. - 10లో



భద్రత మరింత పెంచాలి

యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి, భక్తులకు భద్రత మరింత పెంచనున్నట్లు ఈఓ వెంకట్రావ్ తెలిపారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	586.10 అడుగులు
ఇన్‌ఫ్లో	:	3,28,996 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	3,28,996 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,616 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,500 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	5,226 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్ 54 మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరపాలని సంబంధిత పోలీస్ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు.

అడ్మిషన్లకు గడువు పొడిగింపు

రామగిరి(నల్లగొండ) : డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరంలో యూజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్ల గడువు ఈనెల 12వ తేదీ పొడిగించినట్లు నల్లగొండ రీజినల్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ బొజ్జ అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూజీ, పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజులను చెల్లించడానికి చివరి గడువు కూడా 12వ తేదీ అని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆన్‌లైన్‌లో అడ్మిషన్ పొందాలని సూచించారు. పూర్తి వివరాలకు www.braou.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని, సందేహాలకు 9533101295, 7989339180 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

19న ఎంజీయూలో జాతీయ సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఈ నెల 19న ఎంజీయూలో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాతీయ సదస్సుకు కరపత్రాన్ని ఎంజీ యూనివర్సిటీలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాహత్‌ఖానం, తెలుగు శాఖ అధ్యక్షుడు, సదస్సు సంచాలకుడు తండు కృష్ణకౌండిన్య, వైస్ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, జె.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పథకాలు అమలు చేయాలి

నల్లగొండ : గిరిజనుల అభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆదికర్మయోగి అభియాన్‌పై జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్(డీఎంటీ)లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజనులకు విద్య, వైద్యం, తాగునీరు, సమతుల ఆహారం, ఉపాధి అవకాశాలను అందించడమే లక్ష్యంగా ఆదికర్మ యోగి అభియాన్ పని చేస్తుందని తెలిపారు. జిల్లాలో 14 మండలాల్లోని.. 52 గ్రామాలు, 138 ఆవాసాలను గుర్తించి గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, నారాయణ్ అమిత్, గిరిజన అభివృద్ధి అధికారి ఎం.చత్రు పాల్గొన్నారు.

టీబీని పసిగడుతుంది..



నల్లగొండ : టీబీ వ్యాధి లక్షణాలను ముందుగానే పసిగట్టే పరికరాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఆవిష్కరించారు. రూ.20 లక్షల విలువ చేసే ఈ పరికరాన్ని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అందించింది. రోగిలో టీబీ లక్షణాలను ముందుగా కనిపెట్టడం ఈ పరికరం ప్రత్యేకత. కార్యక్రమం అదనపు కలెక్టర్ శ్రీనివాస్, పౌరసరఫరాల అధికారి వెంకటేష్, మేనేజర్ హరీష్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి నారాయణ, ప్రధాన కార్యదర్శి రేపాల భద్రాద్రి రాములు, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, వెంకటరమణ చౌదరి, గంట సంతోష్‌రెడ్డి, చిల్లంచర్ల శ్రీనివాస్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.





పెద్దవూర పీఏసీఎస్ ఎదుట రాత్రి వేళ పాస్ పుస్తకాలు లైన్‌లో పెట్టి నిరీక్షిస్తున్న రైతులు, నిడమనూరులో జడ్చర్ల- కోదాడ హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు



ఈ రైతు పెంటబోయిన వెంకటేశ్వర్లు. ఈయనది తిరుమలగిరి(సాగర్) మండలంలోని రాజవరం. నాలుగు ఎకరాల్లో వరి నాట్లు వేసి 15 రోజులు కావస్తోంది. ఇప్పటి వరకు యూరియా లభించకపోవడంతో చల్లలేదు. మూడు రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నా ఒక్కటీ లభించలేదు. దీంతో యూరియా లేక, పంట ఎదుగుదల తగ్గిపోయి, దిగుబడి కోల్పోయే ప్రమాదం ఉందని, పెట్టిన పెట్టుబడి కూడా వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నాడు.



ఈ ఫోటోలో కనిపిస్తున్న రైతు పేరు వడ్లపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి. ఇతనిది పెద్దవూర మండలం ఏనేమీదిగూడెం. వానాకాలం సీజన్‌లో 25 ఎకరాలలో వరి సాగు చేశాడు. ఎకరాలకు బస్తా చొప్పున ప్రస్తుతం 25 బస్తాల యూరియా కావాలి. తొలి విడతలో ఫర్టిలైజర్‌లో ఎక్కువ డబ్బులు చెల్లించి కొనుగోలు చేశాడు. ఇప్పుడు ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా దొరకడం లేదు. దీంతో వ్యవసాయ పనులను వదులుకుని మూడు రోజులుగా పెద్దవూర పీఏసీఎస్‌కు తెల్లవారక ముందే వచ్చి క్యూలో నిల్చుంటున్నాడు. రెండు రోజులు రెండు బస్తాల చొప్పున నాలుగు బస్తాలు, సోమవారం ఒక బస్తా మాత్రమే లభించింది. ఇంకా 20 వస్తాలు కావాలంటే.. ఇలా ఎన్ని రోజులు వేచి ఉండాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

అదును దాటుతోంది.. యూరియా ఏది?



శాలిగౌరారంలో ఓ ఎరువుల దుకాణం వద్ద యూరియా రశీదుల కోసం బారులుదీరిన రైతులు

- వరి, పత్తి, పండ్ల తోటలకు ఒకేసారి ఎరువులు అవసరం
- ఈ సమయంలోనే దొరకని యూరియా
- దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతుల ఆందోళన
- రోజుల తరబడి తప్పని ఎదురుచూపులు
- అర్ధరాత్రి కూడా పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : యూరియా కోసం రైతులు తంటాలు పడుతున్నారు. సరైన సమయంలో వర్షాలు కురవడంతో పత్తి, వరి, పండ్ల తోటలకు యూరియా పెట్టుకునేందుకు ఇదే సరైన అదును. నాన్ ఆయకట్టు ప్రాంతంలో వరితోపాటు పత్తికి యూరియా వేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఆయకట్టు ప్రాంతంలో ప్రస్తుతం వరి నాట్లు వేస్తుండటంతో యూరియా అవసరం అధికంగా ఉంది. అందరికీ ఒకేసారి యూరియా అవసరం రావడం.. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేకపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. చివరకు అర్ధరాత్రులు యూరియా కోసం పీఏసీఎస్ కేంద్రాల వద్దే పడుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

ఆందోళన, ధర్నాలు..

ప్రస్తుతం పంటలకు అవసరమైన యూరియా కోసం రైతులు పీఏసీఎస్, ఆగ్రోస్ కేంద్రాల వద్ద బారులు దీరుతున్నారు. ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. ముఖ్యంగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. నిత్యం ఏదో ఒక మండలంలో రైతులు యూరియా కోసం ఆందోళన చేస్తూనే ఉన్నారు. సోమవారం నల్లగొండ జిల్లాలోని మాడుగులపల్లి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు చివరకు నార్కట్‌పల్లి-అద్దంకి జాతీయ రహదారిపై రస్తారోకో చేపట్టారు. ఇక పెద్దవూర, నిడమనూరు మండల కేంద్రాల్లోనూ రైతులు రోడ్డుపై ఆందోళన నిర్వహించారు. తిప్పర్తి, శాలిగౌరారం, హాలియా మండలంలోనూ యూరియా కొరతతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్దవూర, హాలియాలోని కొత్తపల్లి పీఏసీఎస్‌ల వద్ద యూరియా కోసం రాత్రి వేళల్లోనూ అక్కడే నిద్రిస్తున్నారు. ఇక సూర్యాపేట జిల్లా నడిగూడెంలో, ఆత్మకూరు(ఎస్) మండలాల్లో యూరియా కోసం ఆందోళన నిర్వహించగా, మద్దిరాల తదితర మండలాల్లో పీఏసీఎస్, ఆగ్రోస్ కేంద్రాల వద్ద బారులుదీరారు.

అవసరానికి సరిపడా అందని యూరియా..

- నల్లగొండ జిల్లాలో ఇప్పటివరకు 10.73 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. ప్రధానంగా 5,64,585 ఎకరాల్లో పత్తి, 5,05,160 ఎకరాల్లో వరి, 156 ఎకరాల్లో జొన్న, 2951 కంది, 310 పెసర, ఇతర పంటలను సాగు చేశారు. జిల్లాలో వానాకాలం సీజన్ పంటలకు సెప్టెంబర్ వరకు 70 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటివరకు 53 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.
- సూర్యాపేట జిల్లాలో 5,73,006 ఎకరాల్లో పంటలు సాగుచేశారు. అందులో వరి 4.82 లక్షల ఎకరాల్లో, 84 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఆయా పంటలకు జిల్లాలకు 60,734 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంది. అయితే ఇప్పటివరకు 42 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చింది.

ఒకటి, రెండు బస్తాలే..

మరోవైపు ప్రభుత్వం ప్రతి ట్రిప్‌లో జిల్లాకు కేవలం 2 నుంచి 3 వేల మెట్రిక్ టన్నుల యూరియాను మాత్రమే సరఫరా చేస్తోంది. దీంతో వచ్చిన యూరియా వచ్చినట్లు అయిపోతోంది. మరోవైపు రైతులకు కేవలం ఒకటి, రెండు బస్తాల యూరియా మాత్రమే ఇస్తుండటంతో రైతులు పీఏసీఎస్, ఆగ్రోస్ సేవా కేంద్రాలు, ఎన్‌డీసీఎంఎస్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. సమయానికి యూరియా వేయకపోతే పంట దిగుబడి తగ్గి.. పెట్టిన పెట్టుబడులు నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి తగ్గే అవకాశం



మాకున్న ఏడెకరాలతోపాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగుచేశా. రెండు వారాలుగా సహకార సొసైటీ చుట్టూ తిరుగుతున్నా 5 బస్తాల యూరియా మాత్రమే దొరికింది. మరో 7 బస్తాల యూరియా కావాలి. కూలీల కొరతతో కలుపు నివారణకు రసాయన మందుల వాడకం పెరిగింది. దీంతో మొక్క ఎండు బారి, పెరుగుదల లోపిస్తోంది. దీంతో యూరియా వేయడం తప్పనిసరి అవుతోంది. యూరియా లేకపోవడంతో దిగుబడి తగ్గుతుంది. – బుసిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, నిడమనూరు

నాటు వేసి.. నెల రోజులవుతోంది



మాది సోమవారిగూడెం చెరువు, ఏఎమ్మార్పీ సాగు నీటితో మూడు ఎకరాలు వరి సాగు చేశాను. నాటేసి నెలరోజులవుతోంది. ఒక్క దఫా కూడా యూరియా వేయలేదు. పంటను చూస్తే దుఃఖం వస్తోంది. సకాలంలో యూరియా వేస్తేనే వరి దుబ్బు, పిలకలు వచ్చి, దిగుబడి వస్తుంది.

– సింగం రామలింగయ్య, సోమవారిగూడెం, నిడమనూరు మండలం

వరి ఎదుగుదల లేదు



నేను 11ఎకరాల్లో వరి సాగు చేశా. యూరియా కోసం వారం రోజులుగా తిరుగుతున్నా. అయినా దొరకడం లేదు. అదును దాటిపోతోంది. యూరియా వేయపోవడంతో పొలం ఎదుగుదల లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– ఎం.సత్తయ్య, రైతు, రాయినిగూడెం, తిప్పర్తి

రోజుకో బస్తా ఇస్తే ఎలా



వానాకాలం సీజన్‌లో తన భూమితో పాటు కౌలుకు తీసుకుని 14 ఎకరాలలో వరి నాట్లు వేశాను. ప్రస్తుతం యూరియా అవసరం ఏర్పడింది. ఒక్కరికి రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. సోమవారం రెండు లారీల యూరియా వస్తుందని అధికారులు చెప్పడంతో ఇంట్లోని ముగ్గురం తెల్లవారక ముందే పీఏసీఎస్‌కు వచ్చాం. క్యూలో నిల్చుంటే ఒకొక్కరికి ఒక బస్తా మాత్రమే ఇచ్చారు. రోజు ఒక బస్తా ఇస్తే ఎన్నిరోజులు తిరగాలి.

– కొలుపుల సంతు, పోతునూరు, పెద్దవూర మండలం

'పరిషత్' జాబితాకు నోటిఫికేషన్

- జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓటరు జాబితా సవరణకు నోటిఫికేషన్ విడుదల
- ఓటరు జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్
- ఉమ్మడి జిల్లాలో 716 ఎంపీటీసీ, 73 జెడ్పీటీసీ స్థానాలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణతో పాటు అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం తుది ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల ప్రచురణకు సంబంధించిన షెడ్యూల్‌ను జారీ చేసింది. జిల్లాలో అందుకు అవసరమైన ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దృష్టి సారించారు.

6న ముసాయిదా జాబితాల విడుదల

ఈ నెల 6వ తేదీన ఎంపీడీఓ, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాను ప్రచురించనున్నారు. 8వ తేదీన జిల్లాస్థాయిలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల, పోలింగ్ కేంద్రాల జాబితాపై సమావేశం నిర్వహించి వారి నుంచి సూచనలు తీసుకోనున్నారు. అదే రోజు మండల స్థాయిలో కూడా రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తారు. 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలను ఇతర సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తారు. వచ్చిన ఫిర్యాదులను 9వ తేదీన పరిష్కరిస్తారు. 10వ తేదీన తుది ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాను ప్రకటించనున్నారు.

ఎన్నికలకు సిద్ధంగా..

ఉమ్మడి జిల్లాలో 716 ఎంపీటీసీ, 73 జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ఈ ప్రక్రియను జిల్లా యంత్రాంగం చేపట్టనుంది. నల్లగొండ జిల్లాలో 352 ఎంపీటీసీ స్థానాలు, 33 జెడ్పీటీసీ స్థానాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 178 ఎంపీటీసీ స్థానాలు, 17 జెడ్పీటీసీ స్థానాలు, సూర్యాపేట జిల్లాలో 186 ఎంపీటీసీ స్థానాలు, 23 జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను, పోలింగ్ స్టేషన్లను జిల్లాల అధికారులు ఖరారు చేయనున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండేలా ఈ చర్యలు చేపడుతున్నారు.

అమ్మా.. మా గోడు వినండి!

- గ్రీవెన్స్‌డేలో కలెక్టర్‌కు బాధితుల విన్నపం
- వినతులు స్వీకరించి భరోసా ఇచ్చిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు, అధికారులు

నల్లగొండ : అమ్మా.. మా గోడు విని.. మా సమస్య పరిష్కరించండి అంటూ పలువురు బాధితులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ప్రజలు కలెక్టరేట్‌కు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మొఊత్తం 99 మంది కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులకు వినతులు సమర్పించారు. వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 69.. ఇతర ఫిర్యాదులు 30 ఉన్నాయి. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆయా శాఖలకు పంపారు. ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ ఉన్నారు.

అమ్మలా ఆదరించి.. ఆదుకుంటానని భరోసా ఇచ్చి..



మానసిక దివ్యాంగురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన చొల్లేటి సోని మానసిక దివ్యాంగురాలు. తల్లితో కలిసి గ్రీవెన్స్ హాల్ వద్దకు వచ్చింది. గ్రీవెన్స్ హాల్ ముందు సోని పడుకుంది. గ్రీవెన్స్ హాల్‌కు వస్తున్న కలెక్టర్ ఆ బాలికను చూసి తల్లిని వివరాలు అడిగింది. ఇప్పటి వరకు తన కూతురుకు పింఛన్ వచ్చేదని.. ఐరిష్, తంబ్ రాకపోవడం వల్ల ఇప్పుడు ఇవ్వనంటున్నారని.. కలెక్టర్‌కు వివరించింది. స్పందించిన కలెక్టర్ ఇక్కడి నుంచి ఇంటికి వెళ్లండని.. తహసీల్దార్ వచ్చి మీ వివరాలు తెలుసుకుని మీ సమస్య పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. బాలికకు వైద్య పరమైన సహాయం అందించాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, కలెక్టరేట్ ఏఓ మోతిలాల్ వారికి కొంత ఆర్థిక సాయం అందజేశారు.

రోడ్ల మరమ్మతుకు అంచనాలు రూపొందించాలి

నల్లగొండ : ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతుకు అంచనాలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టరేట్‌లో హైదరాబాద్ నుంచి సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రకృతి విపత్తు, నష్టాలపై వెంటనే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రోడ్లు తెగిపోవడం, లోలెవల్ కాజ్‌వేలు, కల్వర్టులు, చెరువుల మరమ్మతుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎస్పీ శరత్ చంద్రపవార్, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, ఏఎస్పీ మౌనిక, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, రమేష్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మురళి
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉగ్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి జి.శేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదు నల్ల చొక్కాలు ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్‌కు సంబంధించి వేతనంలో కట్ చేసిన ఉద్యోగుల వాటాకు, ప్రభుత్వ వాటాను జమ చేయకపోవడం దారుణమన్నారు. సీపీఎస్ ద్వారా ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, హెల్త్ కార్డులను అమలు చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్లు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, తరాల పరమేష్, అలీం, వెంకులు, శ్రీనివాస్, భిక్షమయ్య, జనార్దన్, సందీప్‌రెడ్డి, చరిత రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీశైలం, వెంకట్రామ్ రెడ్డి, చేపూరి నర్సింహాచారి, రాంబాబు, ఆకునూరి లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, మనోజ్‌కుమార్, ప్రవీణ్, సైదులు, సత్యనారాయణ, కాశీం, మధు, రమాదేవి, నరేష్, రమ్యసుధ, శ్రీనివాస్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు, ధర్నాలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న ఉద్యోగి

కాంగ్రెస్ కుట్రలను తిప్పికొడతాం

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- కాళేశ్వరంపై ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ నల్లగొండలో బైక్‌ర్యాలీ, రాస్తారోకో



గడియారం సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణులు

నల్లగొండ టూటౌన్: కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా ప్రజల మద్దతుతో తిప్పికొడతామని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు నల్లగొండలోని గడియారం సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు పన్ని కేసీఆర్, హరీష్‌రావును బదనాం చేయాలని చూస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రజల మద్దతు కోల్పోయిందని ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడిందని.. ప్రజల దృష్టి మళ్లించడానికే కాళేశ్వరం నాటకం ఆడుతోందని ధ్వజమెత్తారు. రాస్తారోకో చేస్తున్న కంచర్ల భూపాల్‌రెడ్డిని, బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ సంతకాలు తీసుకుని సొంత పూచికత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో బండా నరేందర్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, సింగం రామ్మోహన్, మాలే శరణ్యారెడ్డి, నాగార్జున, బక్క పిచ్చయ్య, యుగంధర్ రెడ్డి, బోనగిరి దేవేందర్, చీరా పంకజ్ యాదవ్, , రేగట్టే మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేతకాని దద్దమ్మ సీఎం రేవంత్‌రెడ్డి : చిరుమర్తి

నకిరేకల్ : ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న చేతకాని దద్దమ్మ సీఎం రేవంత్‌రెడ్డి అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన కమిషన్‌ను ఎత్తి వేయాలని కోరుతూ నకిరేకల్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఏ ఎన్నికలు వచ్చినా కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డం పెడుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. సాగర్ నీళ్లు ఆంధ్రాకు పోతుంటే తెలంగాణ ప్రజలకు నీళ్లు ఇచ్చే సోయి మరిచి బీఆర్‌ఎస్ నేతలపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ కాళ్లు పట్టుకుని.. కాళేశ్వరంపై కేసులు వేయిస్తూ కేసీఆర్‌ను అణిచివేయాలని కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తక్షణమే కేసులును ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్, మున్సిపల్ మాజీ చైర్మన్లు కొప్పుల ప్రదీప్‌రెడ్డి, రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీలు తలారి బలారం, మాద ధనలక్ష్మీనగేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, నాయకులు పెండెం సదానందం, రాచకొండ వెంకన్నగౌడ్, సామ శ్రీనివాస్‌రెడ్డి, పల్లె విజయ్, పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, వంటల చేతన్, గోర్ల వీరయ్య, యానాల లింగారెడ్డి, పేర్ల శ్రీకాంత్, నోముల కేశవరాజు, రావిరాల మల్లయ్య పాల్గొన్నారు.



నకిరేకల్‌లో రాస్తారోకో చేస్తున్న చిరుమర్తి లింగయ్య, నాయకులు

కోతుల దాడిలో వ్యక్తికి గాయాలు

హుజూర్‌నగర్ : కోతుల దాడిలో వ్యక్తికి గాయాలైన సంఘటన హుజూర్‌నగర్ మండలంలోని అమరవరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వీర బోయిన వెంకన్న తన ఇంట్లో గేదెలకు మేత వేస్తుండగా వెనుక నుంచి కోతుల గుంపు దాడి చేసింది. దీంతో అతడి కాలుకు గాయాలు కావడంతో హుజూర్ నగర్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో సోమవారం శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణాన్ని వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, గర్భాలయంలో శ్రీ మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరిపించారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లను ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. క్షేత్రంలోని శివాలయంలో గల శ్రీపార్వతీ రామలింగేశ్వర స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. అనంతరం మహానివేదనగావించారు.

సెల్‌ఫోన్ వదిలితేనే స్టీరింగ్

బస్సు నడిపే సమయంలో సెల్‌ఫోన్ వాడకంపై నిషేధం

- సెక్యూరిటీ కార్యాలయం వద్ద అప్పగించాకే విధులకు వెళ్లాలని సూచన
- పైలట్ ప్రాజెక్టు కింద మిర్యాలగూడ ఆర్టీసీ డిపో ఎంపిక
- సోమవారం నుంచి అమలులోకి వచ్చిన నిర్ణయం



మిర్యాలగూడ ఆర్టీసీ డిపో గేటు వద్ద సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఆర్టీసీ డ్రైవర్

మిర్యాలగూడ టౌన్ : కొంత మంది ఆర్టీసీ డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు నడుపుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై డ్యూటీ సమయంలో బస్సు డ్రైవర్లు సెల్‌ఫోన్ వాడొద్దని ఆదేశాలు జారీ చేసింది. ముందుగానే సెల్‌ఫోన్లను డిపోలోని సెక్యూరిటీ అధికారి కార్యాలయంలో డిపాజిట్ చేసి విధులకు వెళ్లాలని సూచించింది.

ఆయా డిపోల్లో సర్వే నిర్వహించిన ఆర్టీసీ

ఉమ్మడి జిల్లాలో దేవరకొండ, నార్కట్‌పల్లి, యాదగిరిగుట్ట, సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ, నల్లగొండ డిపోలు ఉండగా గత నెలలో ఆయా డిపోల్లో ఇతర జిల్లాలకు సంబంధించిన ఆర్టీసీ సిబ్బందిని ఒక్కో డిపోకు ఐదుగురు చొప్పున కేటాయించి ఆర్టీసీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఒక్క మిర్యాలగూడ డిపోలో 162 మంది డ్రైవర్లు ఉండగా వీరిలో సుమారు 90 మంది వరకు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది. దీంతో నల్లగొండ రీజియన్‌లో మిర్యాలగూడ ఆర్టీసీ డిపోను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. రాష్ట్రంలో 11 డిపోల్లో ఈ నిర్ణయం తీసుకోగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మిర్యాలగూడ డిపోలో సోమవారం నుంచి అమలు చేసింది. డిపోలో మొత్తం 162 మంది డ్రైవర్లు ఉండగా ప్రతి రోజు 70 నుంచి 100 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే విధి నిర్వహణలో భాగంగా తొలి రోజు డ్యూటీకి వెళ్లి 38 మంది విధుల్లో చేరే ముందు తన సెల్‌ఫోన్లను డిపోలోని సెక్యూరిటీ అధికారి కార్యాలయంలో డిపాజిట్ చేశారు. విధులు ముగించుకున్న తరువాత ఇంటికి వెళ్లేటప్పుడు వీటిని తీసుకువెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. సెల్‌ఫోన్లను భద్రపరిచేందుకు ప్రత్యేకంగా సంచులను తయారు చేయించారు. ఏదైనా అత్యవసరమైన పరిస్థితుల్లో బస్సులోని సంబంధిత కండక్టర్లకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే డ్రైవర్ ఫోన్ మాట్లాడేందుకు అవకాశం కల్పించనున్నారు. కాగా.. మిర్యాలగూడ డిపో నుంచి కాకినాడ, తిరుపతికి వెళ్లే బస్సులకు సంబంధించి 12 మంది డ్రైవర్లు ఉండగా దూరపు ప్రయాణంతో పాటు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటుండటంతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ డ్రైవర్లకు ఈ నిబంధన మినహాయించారు.



ప్రత్యేకంగా తయారు చేసిన సంచుల్లో భద్రపరిచిన ఫోన్లు

ప్రయాణికుల రక్షణ కోసమే



ఆర్టీసీ తీసుకున్న నిర్ణయాన్ని బస్సు డ్రైవర్లు కూడా స్వాగతిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా డ్యూటీకి వెళ్లే సమయంలో సెక్యూరిటీ కార్యాలయంలో డిపాజిట్ చేస్తున్నారు. ప్రయాణికులను గమ్యస్థానానికి సురక్షితంగా చేర్చాలనేది ఆర్టీసీ లక్ష్యం. అయితే చాలా మంది కూడా తమ సెల్‌ఫోన్లు ఇంటి వద్దనే ఉంచుతుండగా కొంత మంది డిపో వద్ద డిపాజిట్ చేసి డ్యూటీ దిగి వెళ్లిపోయే సమయంలో తీసుకెళ్తున్నారు. ఏదైనా అత్యవసరమని అనుకుంటే తాము ఆ బస్సు కండక్టర్‌కు ఫోన్ చేసి ఆ డ్రైవర్‌తో మాట్లాడిస్తాం.

– రాంమోహన్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం, మిర్యాలగూడ

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

మర్రిగూడ: అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జంపాల తిరుపతయ్య(47) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థంకాక మనోవేదనతో తన కటింగ్ షాప్‌లో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య జంపాల విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు.



తిరుపతయ్య (ఫైల్)

కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు



26గేట్ల ద్వారా విడుదలవుతున్న వరద నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. నాగార్జునసాగర్ జలాశయానికి 3,28,996 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. 26 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా, విద్యుదుత్పాదన ద్వారా దిగువ కృష్ణానదిలోకి 3,12,170 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతం 586.10 అడుగులు, 300.8385 టీఎంసీలు ఉంది.

బంగారం, నగదు చోరీ

హుజూర్‌నగర్ : ఓ వ్యక్తి తన భార్యను తీసుకువచ్చేందుకు అత్తగారింటికి వెళ్లి రెండు రోజుల తర్వాత వచ్చే సరికి ఇంట్లో బంగారం, వెండి ఆభరణాలు, నగదు ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సంఘటన హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురంలో సోమవారం వెలుగుచూసింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం గ్రామానికి చెందిన పేరూరి భాగ్యరాజు గత నెల 28న తన భార్యను తీసుకురావడానికి అత్తగారి ఊరైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్నపరెడ్డిపల్లి మండలం ఎర్రగుంట గ్రామానికి వెళ్లాడు. అక్కడ రెండు రోజులు ఉండి సోమవారం స్వగ్రామం చేరుకున్నారు. ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడేసి ఉన్నాయి. బీరువాను పరిశీలించగా.. అందులోని సుమారు 10 తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.5 లక్షల నగదు అపహరణకు గురైంది. విషయం తెలుసుకున్న సీఐ చరమంద రాజు, ఎస్ఐ మోహన్‌బాబు సంఘటనా స్థలాన్ని క్లూస్ టీంతో సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్‌బాబు తెలిపారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు







భద్రత మరింత పెంచాలి : ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి, క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మరింత భద్రత పెంచే విధంగా పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆలయ ఈఓ వెంకట్రావ్ తెలిపారు. యాదగిరి కొండపైగల ప్రధాన కార్యాలయంలో ఏసీపీ శ్రీనివాస్ నాయుడుతో పాటు పోలీస్ అధికారులు, ఆలయ ఉద్యోగులతో సోమవారం రాత్రి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ ఈఓ మాట్లాడుతూ.. కొండ కింద దేవస్థానం పరిసర ప్రాంతాలు, గిరి ప్రదక్షిణ మార్గంలో, దేవస్థానం అద్దె గదుల ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో విధిగా గస్తీ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టెంపుల్ సిటీకి వెళ్లే మార్గాల్లో బారికేడ్లతోపాటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కొండపైన స్థలం తక్కువ ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు సాధ్యమైనంత వరకు కొండ కింద వాహనాలను పార్కింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కొండ కింద వాహనాలు పార్కింగ్ చేసిన భక్తులను కొండపైకి చేరే విధంగా ఏసీ బస్సులను నడిపేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కల్యాణకట్ట, వ్రత మండపం, శివాలయం క్యూ మార్గంలో బ్యాగేజ్ స్కానర్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, సీఐ భాస్కర్, ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్ శర్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు దయాకర్ రెడ్డి, రామారావు, ఆర్ఐ శేషగిరిరావు పాల్గొన్నారు.

యాదగిరీశుడి కల్యాణం అద్భుతం

- శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి కెనడా ప్రధాని ప్రశంస

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని, నిర్వాహకులను కెనడా ప్రధాని మార్క్ కార్నీ అభినందిస్తూ ఆదివారం రాత్రి లేఖ పంపారు. ఆలయ పూజారులు, అర్చకులు కెనడా దేశంలోని వివిధ ప్రాంతాల్లో గత నెలలో ఆలయ విశ్రాంత ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ అధికారి గజివెల్లి రఘు ఆధ్వర్యంలో యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం జరిపించారు. ఆగస్టు 23న విండ్సర్, 24వ తేదీన టొరంటో నగరంలో, 30న ఒట్టావా నగరంలో కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా కెనడా ప్రధాని మార్క్ కార్నీ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో భక్తులకు అందుతున్న సేవలపై టెంపుల్ బోర్డును అభినందించారు. కెనడాలోని ఒట్టావా నగరంలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఇటీవల స్వామి వారి కల్యాణం జరిగిన తీరుతెన్నులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్వామి వారి కళ్యాణం చాలా ఘనంగా, వైభవముగా, అద్భుతంగా నిర్వహించారని కొనియాడారు. హిందూ సంస్కృతిలోని విభిన్నత, ఆధ్యాత్మికత, ఐక్యతను ప్రశంసించారు. కాగా, కెనడా ప్రధాని మార్క్ కార్నీ లేఖపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆలయ ఈవో వెంకటరావు హర్షం వ్యక్తం చేశారు.



యాదగిరి క్షేత్ర నిర్వాహకులకు కెనడా ప్రధాని రాసిన లేఖ

నిడమనూరు మార్కెట్‌ను సందర్శించిన విద్యార్థులు



మార్కెట్ చైర్మన్‌తో సమావేశమైన విద్యార్థులు

నిడమనూరు : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కంపాసాగర్‌కు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు సోమవారం నిడమనూరు వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. విద్యార్థులు మార్కెట్ పరిధిలోని వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెట్ సౌకర్యాలను పరిశీలించారు. కొనుగోళ్లు, అమ్మకాల వివరాలను మార్కెట్ చైర్మన్ అంకతి సత్యంను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ ద్వారా పశువులకు వైద్యశిబిరాలు కల్పించి రైతులకు పశుపోషణలో సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి చందర్‌రావు, వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

రవాణా శాఖ వెబ్‌సైట్‌పై అవగాహన కల్పించాలి

- రవాణా శాఖ అధికారి వాణి

కోదాదరూరల్ : రవాణాశాఖ నూతనంగా తీసుకువచ్చిన వెబ్‌సైట్ www.ttransport.gov.in పై వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉమ్మడి జిల్లా రవాణా శాఖ అధికారి డీటీఓ వాణి సూచించారు. ఆదివారం రాత్రి కోదాడ మండల పరిధిలోని చిమిర్యాల శివారులో ఉన్న అంతర్రాష్ట్ర రవాణా శాఖ చెక్‌పోస్టును ఆమె తనిఖీ చేశారు. టెంపరరీ పర్మిట్, వలంటరీ ట్యాక్స్, స్పెషల్ పర్మిట్‌పై వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ విధానంతో సిబ్బందికి పనిభారం తగ్గడంతో పాటు వాహనదారులకు సమయం ఆదా అవుతుందన్నారు. ఆమె వెంట నల్లగొండ డీటీఓలు కొండయ్య, సూర్యాపేట డీటీఓ జయప్రకాష్‌రెడ్డి, ఎంవీఐలు రాజ్‌మహ్మద్, శ్రీనివాస్, ఏఎంవీఐలు సాయిప్రసాద్, లావణ్య, సిబ్బంది ఉన్నారు.



చిమిర్యాల శివారులోని చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న వాణి

చెరువు వద్ద కాపలాకు వెళ్లి.. అస్వస్థతకు గురై మృతి

వలిగొండ : చేపల చెరువు వద్ద కాపలాకు వెళ్లిన ఓ యువకుడు అస్వస్థతకు గురై అక్కడే మృతి చెందిన సంఘటన వలిగొండ మండలంలోని గోకారంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోకారం గ్రామానికి చెందిన చెరక శ్రీను(35) చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి గ్రామంలోని చెరువు వద్ద కాపలాగా చెరక విక్రమ్, చెరక యాదగిరితో కలిసి వెళ్లాడు. అస్వస్థతకు గురైన శ్రీను అక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ సోమవారం తెలిపారు.

గర్భిణి మృతి కేసులో మరో ముగ్గురు అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటటౌన్ : అబార్షన్ చేయడంతో వైద్యం వికటించి గర్భిణి మృతి చెందిన కేసులో మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలి పారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన ఐదు నెలల గర్భిణి బయ్య అనూష మృతి చెందిన కేసులో సూర్యాపేట పట్టణంలోని ఒమేగా హాస్పిటల్‌లో అబార్షన్‌కు ఏర్పాట్లు చేసిన హాస్పిటల్ నిర్వాహకుడు ఏ1 గోరంట్ల సంజీవ, సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు ఏ2 జాల జానయ్యను, ఒమెగా ఆస్పత్రి మేనేజ్‌మెంట్ ఏ6 వేణును సూర్యాపేటలోని ఓ హోటల్ వద్ద అరెస్టు చేశారు.

మూడోసారి ఆడపిల్ల అని తెలియడంతో అబార్షన్

మోతె మండలం రాఘవపురం గ్రామానికి చెందిన బయ్య నగేష్‌కు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భార్య అనూష మూడోసారి ప్రెగ్నెంట్ కాగా.. లింగ నిర్ధారణ పరీక్ష చేసేందుకు తన దగ్గరి బంధువైన అదే గ్రామానికి చెందిన ఏ8 ఉప్పల సందీప్ ద్వారా టేకుమట్ల గ్రామంలో ఆర్ఎంపీగా పని చేస్తున్న ఏ2 జాల జానయ్యను సంప్రదించాడు. నకిరేకల్‌కు చెందిన ఆర్ఎంపీ ఏ3 బాత్క యాదగిరి వద్ద మే 17న అల్ట్రా సౌండ్ స్కానింగ్ నిర్వహించి గర్భంలో ఉంది ఆడ శిశువు అని తెలుసుకున్నారు. స్కానింగ్ చేయించినందుకు ఆర్ఎంపీ జానయ్య ఏ9 బయ్య నగేష్ వద్ద రూ.12వేలు తీసుకున్నాడు. అబార్షన్ చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఒమేగా హాస్పిటల్(సంజీవని హాస్పిటల్) నిర్వాహకులు గోరెంట్ల సంజీవ, వీరబోయిన వేణును సంప్రదించి కూసుమంచికి చెందిన నాగరాజు, అర్వపల్లికి చెందిన చెవుగోని గణేష్‌లతో అబార్షన్ చేయించారు. గర్భిణీకి వైద్యం వికటించి తీవ్ర రక్తస్రావం కావడంతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్ష చేసిన వైద్యులు అనూష అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి కార్యాలయం వారు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి కేసులో మొత్తం 10 మంది నిందితులను గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఇప్పటికే నలుగురు రిమాండ్

ఈ కేసులో ఇప్పటికే ఏ8 అయిన ఉప్పల సందీప్‌ను, అబార్షన్ చేసిన చెవుగోని గణేష్‌ను మే 29న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా నకిరేకల్‌లో గర్భిణికి స్కానింగ్ చేసిన ఆర్ఎంపీ డాక్టర్ బాత్క యాదగిరిని ఆగస్టు 8న అరెస్టు చేసినట్లు చెప్పారు. అలాగే మరో మైనర్ వ్యక్తిని కూడా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

పంట తొలిదశలోనే తెగుళ్లను నివారిద్దాం

- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిరణ్ సూచనలు



గరిడేపల్లి: వివిధ దశల్లో ఉన్న వరి పైర్లకు అగ్గి తెగులు (ఆకుమచ్చ దశ) ఆశించే అవకాశం ఉన్నందున రైతులు తొలిదశలోనే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని గడ్డిపల్లి కేవీకే మృత్తిక శాస్త్రవేత్త కిరణ్ సూచించారు. వివిధ పంటల్లో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

- వరిలో అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ మ్యాంకోజెబ్ 2.5గ్రా లేదా ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ప్రధాన పొలాన్ని పొడి దుక్కి దున్ని, నీరు పెట్టి 3–4రోజులు ఉంచి.. వారం రోజులలోపు రోటవేటర్‌తో దమ్ము చేసుకొని నాట్లు వేసుకోవాలి. ఎకరానికి 50కిలోల డీఏపీ దమ్ము తర్వాత మరియు 25కిలోల యూరియా 14కిలోల యూరియా 14కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ నాట్లు వేసే ముందు వేసుకోవాలి.
- నత్రజని ఎరువును 3–4దఫాలుగా వేయాలి. దమ్ములోనూ, పంట బాగా దుబ్బు చేసే దశలో (25–30 కిలోల యూరియా) మరియు అంకురం తొడిగే దశలోనూ (25–30కిలోలు) బురద పనులో వెదజల్లి 36–48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి.



కంది పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

- రేగడి నేలల్లో పొటాష్ ఎరువును ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకేసారి వేయాలి. తేలిక భూముల్లో ఆఖరి దమ్ములో సగం (14కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్), అంకురం ఏర్పడే దశలో (14కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) మిగతా సగాన్ని వేయాలి.
- నాట్లు వేసేటప్పుడు ప్రతి 2మీటర్లకు 2అడుగు కాలిబాటలు తీసుకోవాలి. దమ్ము చేయకుండా నేరుగా విత్తినప్పుడు 25శాతం ఎరువును నాటు పద్ధతి కన్నా అధికంగా వేయాలి. మూడు సమాన భాగాలుగా నత్రజని ఎరువును విత్తిన 15–20రోజులకు, పిలక, చిరుపొట్ట దశలో వేయాలి. ఈ పద్ధతిలో 45రోజుల వరకు కలుపు లేకుండా జాగ్రత్త పడాలి.
- ప్రధాన పొలంలో కలుపు మొక్కల నివారణకు ఎకరానికి 4కిలోల బెన్సల్ఫ్యూరాన్ మిథైల్ 0.6శాతం జీఆర్, ప్రెటిలాక్లోర్ 6శాతం జీఆర్ గుళికలను నాటిన 3–5రోజుల్లోపు 20కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలి. నేరుగా వెదజల్లే పద్ధతి లేదా డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగు చేసే రైతులు ఎకరానికి ప్రెటిలాక్లోర్, సాపనర్ 600–800మి.లీ 3–5రోజుల్లోపు 20కిలోల ఇసుకతో కలిపి చల్లాలి.
- ప్రధాన పొలంలో నాటిన 18–20రోజుల తర్వాత కాండం తొలిచే పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3సిజీ 10కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 సీజీ 8కిలోలు ఇసుకలో కలుపుకొని చల్లాలి.
- వరినాట్లు ఆలస్యమైతే ఉల్లికోడు ఆశించే అవకాశం ఉన్నందున దాని నివారణగా రైతులు కార్బోఫ్యూరాన్ 3సిజీ 10కిలోలు ఒక ఎకరానికి చల్లాలి.

పత్తి, కంది సస్యరక్షణ చర్యలు

- పత్తి చేను బెట్ట లేదా అధిక వర్షాలకు గురైనప్పుడు 19–19–19 లేదా 13:0:45లాంటి పోషకాలను లీటరు నీటికి 10గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.
- అధిక సాంద్రతలో పత్తిని సాగు చేస్తున్న రైతులు మొక్క పెరుగుదలను, శాఖీయ కొమ్మల పెరుగుదలను అదుపులో ఉంచుకోవాలి. పెరుగుదల నియంత్రణకు మొక్కల 40–50 రోజుల దశలో ఉన్నప్పుడు మెపిక్వాట్‌క్లోరైడ్ మందును లీటరు నీటికి 1.2మి.లీ కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. తద్వారా పత్తికాయ సైజు కూడా సమానంగా ఉంటుంది. పత్తిలో తామర పురుగులు, పేనుబంక, పచ్చదోమ నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఎసిటామిప్రిడ్ 0.2గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0మి.లీ లేదా ఫ్లోనికామిడ్ 0.3గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25మి.లీ లేదా డైఫెన్ థయూరాన్ 1.22గ్రా. లేదా స్పైనోటోరమ్ 0.9 మి.లీ లేదా లోక్సాఫ్లోర్ 1గ్రా. లేదా ఎసిఫేట్, ఇమిడాక్లోప్రిడ్ 2గ్రా. లేదా డైనోటోఫ్యూరాన్ 0.4గ్రా. లీటరు నీటికి కలుపుకొని మందులను మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలి.
- తెల్లదోమ నివారణకు సల్ఫోక్సాఫ్లోర్ 0.6గ్రా. లేదా డైఫెన్థయూరాన్ 1.25గ్రా. లేదా బైఫెన్ డైఫెన్థయూరాన్ 1.25 గ్రా. మందులను లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి.
- గులాబీ రంగు పురుగు నివారణకు పంట పూత దశ నుండే లింగాకర్షక బుట్టలు ఎకరాకు 4 నుంచి 8 వరకు పెట్టుకోవాలి. గుడ్డి పూలను ఎరివేయాలి. పురుగు తాకిడిని బట్టి మొదటగా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ వేప కషాయం లేదా వేపనూనె 5మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

- కంది పంటలో అంతరకృషి చేసి కలుపును నివారించి భూమిని గుల్లబారేలా చేస్తే భూమిలో తేమ బాగా నిలిచి బెట్టను కొంత వరకు తట్టుకోగలదు. అంతర కృషి సాధ్యం కాని పరిస్థితుల్లో కలుపు నివారణకు విత్తిన 20రోజులకు ఇమాజితా ఫిర్ 300మి.లీ ఎకరానికి అనగా 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే గడ్డి, వెడల్పాకు కలుపును నివారించవచ్చు. బెట్ట పరిస్థితుల్లో పేనుబంక ఆశించి మొక్కలు పాలిపోతాయి. దీని నివారణకు 20గ్రా. యూరియా ద్రావణం లేదా 10గ్రాముల మల్టీ కె లేదా పాలిఫీడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.